ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
ఆదివారం 12 మే 2024
7



ఎన్నికల బందోబస్తుకు 3 వేల మంది పోలీసులు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు అదనపు బలగాలు
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు
- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

10



ఆఖరి అంకం



ప్రచారానికి తెర.. ప్రలోభాలతో ఎర

- ముగిసిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు రాజకీయ పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలు
- ఓటుకు రూ.100 నుంచి రూ.250 ఇస్తున్న పార్టీలు
- సండే స్పెషల్ మటన్, చికెన్, ఫిష్ సిద్ధం!
- పంపకాలపై పోలీసుల ప్రత్యేక నిఘా

మహబూబాబాద్, మే11 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. శనివారం సాయంత్రం 5 గంటలకు మైకులు బంద్ అయ్యాయి. ఊళ్లు, వాడలు, పట్టణాలు, మండలకేంద్రాలు ఒక్కసారిగా నిశబ్దంగా మారిపోయాయి. పోలింగ్‌కు 36 గంటల ముందు ప్రచారానికి తెరపడింది. సోమవారం ఓటింగ్ జరుగనుండటంతో ప్రలోభాలకు ఎరవేసే ప్రక్రియ ఆఖరి ఘట్టానికి చేరుకుంది. ప్రతీ ఒక్కరు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పోలింగ్ సమయం ఆసన్నమైంది. ఇన్ని రోజుల ప్రచారం ఒక లెక్క.. ఈ రెండు రోజులు పంపిణీ మరోలెక్క అన్నట్టు సమీకరణలు తారుమారు అయ్యే పరిస్థితులు దగ్గరకొచ్చాయి. పోటాపోటీగా ప్రచారాలు చేసి ఓటర్లను ఆకర్షించేందుకు ఇన్నిరోజులు జరిగిన ప్రయత్నం ఒకటైతే ఇప్పుడు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు చివరి అస్త్రాలను ప్రయోగించేందుకు అంతా సన్నద్ధమయ్యారు.



నిఘా నేత్రానికి చిక్కకుండా చాటుమాటుగా కరెన్సీ చేతులు మారుతూ.. నేతల తలరాతను మార్చే అంకం ఇక ఆరంభానికి సిద్ధమైంది. నగదు, మద్యం ప్రవాహన్ని అడ్డుకునేందుకు పోలీసులు పకడ్బందీ నిఘాతో ప్రత్యేకబలగాలను రంగంలో దింపారు. ఎక్కడికక్కడే తనిఖీలు కొనసాగిస్తున్నారు. అయినప్పటికి చాపకింద నీరులా పంపకాల ప్రహసనానికి ప్రధాన రాజకీయ పార్టీల శ్రేణులు రంగంలో దిగాయి. మొత్తానికి ఆయా ప్రలోభాలు చేరాల్సిన చోటకు ఇప్పటికే చేరిపోయాయని ప్రచారం జరుగుతోంది. ఒకప్రధాన రాజకీయ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఓటర్లలో 70 శాతం మందికి రూ.250 చొప్పున పంపిణీకి సిద్ధమైందని చెబుతున్నారు. మరోపార్టీ రూ.100 చొప్పున తమ పార్టీ శ్రేణులకు అందించేందుకు ఇప్పటికే సన్నాహాలు పూర్తి చేసిందని అంటున్నారు. త్రిముఖ పోటీలోని ఇంకో పార్టీ విషయంలో అటుఇటు కాకుండా సింబల్ ఓటింగ్‌కు ఉన్న బలాన్నిబట్టి ఒకరేటు.. తటస్తులకు ఇంకోరేటు.. ప్రతిపక్షం నుంచి తమవైపు దృష్టిసారించే వారికి ఇంకోరేటు చొప్పున ఇచ్చేట్టు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. మొత్తానికి ప్రచారానికి తెర పడిన రాత్రే ప్రలోభాల ఎరకు తెరలేస్తోంది.

ప్రచారం ముగిసింది.. ఇక దేఖో..

మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసింది. ఓటుకు నోటిచ్చే ప్రలోభపర్వానికి బూత్‌లు, వార్డుల వారీగా జాబితాలు సిద్ధం చేశారు. ఐదేళ్ల రాజకీయ భవిష్యత్ కోసం ఆఖరి ప్రయత్నాలకు వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు శ్రీకారం చుట్టారు. శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. అదే సమయానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) మద్యం దుకాణాలు, బార్‌లకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు స్వయంగా వెళ్లి సీల్ వేశారు. ఇక కొద్ది సమయంలోనే ఓటర్లను తమవైపు మలుచుకునేందుకు అధికార, ప్రతిపక్షాల అభ్యర్థులు వ్యూహ ప్రతివ్యూహాల అమలుకు తమ ముఖ్య అనుచరులను, పార్టీ ముఖ్యులను రంగంలో దింపారు. ఏప్రిల్ 18న లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా, ఆ నాటి నుంచి 25 వరకు నామినేషన్‌లు స్వీకరించారు. 29న ఉపసంహరణ, అనంతరం 23మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ప్రకటించారు. ఆ రోజు నుంచి మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలో ఉన్న ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల సరిహద్దు ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, భద్రాచలం, పినపాక అసెంబ్లీ సెగ్మెంట్‌లలో ప్రచార హోరు కొనసాగింది.

ఇక అంతా గోప్యంగానే ప్రచారం కొనసాగాలి. ప్రలోభాలు కూడా అదే రీతిన రహస్య ప్రదేశాల నుంచి ఓటర్లకు అందించే ప్రణాళిక సమర్థవంతంగా అమలు చేసేందుకు ఆయా పార్టీలు సిద్ధమయ్యాయి. మరోపక్క లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వివిధ విభాగాల బృందాలను అప్రమత్తం చేశారు. ప్రచారం పూర్తితో ఎక్కడికక్కడే చెక్‌పోస్టుల వద్దే కాకుండ అన్ని చోట్లా నిఘా పెరిగింది. జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ నేతృత్వంలో మద్యం, నగదు పోలీసుల కళ్లుకప్పి ఓటర్ల వద్దకు ప్రలోభాల రూపంలో చేరకుండా చర్యలు చేపట్టారు. వివిధ పార్టీలు మాత్రం ముందుగానే రెండ్రోజులు మద్యం దుకాణాలకు సీల్ ఉంటుందని ముందుజాగ్రత్తలు తీసుకున్నాయి. వివిధ రకాల మద్యం బాటిళ్లు, బీర్లతో పాటు పెద్ద ఎత్తున సమీకరించి రహస్య ప్రదేశాల్లో నిల్వ చేశారు. వాటిని పంపిణీ చేసే బాధ్యతను బూత్ కన్వీనర్‌లకు అందజేస్తున్నారు.

కొన్ని మండలకేంద్రాలు, ప్రధాన గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఆశపడుతున్న నాయకులు తమతమ ప్రాంతాల వారీగా సండే స్పెషల్‌గా మగవాళ్లకు మందు, ఆడవాళ్లకు మటన్, చికెన్, ఫిష్ అందజేసేందుకు ఎక్కడికక్కడే రాజకీయ పార్టీల ముఖ్యులు ఏర్పాట్లను చేసుకుంటున్నారు. మొత్తానికి అంతటా ఎన్నికల హడావుడి కన్పిస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

- సుధీర్‌కుమార్, కవిత గెలుపునకు కృషి చేయాలి
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వివరాలు : 10లో..

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

- లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 1,809 పోలింగ్ కేంద్రాలు
- రేపటి పోలింగ్‌కు 8,683 మంది సిబ్బంది కేటాయింపు
- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మహబూబాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్రఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం.. పార్లమెంట్ ఎన్నికలను స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నట్లు మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజ కవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 23 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు వివరించారు. 1,809 పోలింగ్ కేంద్రాలకు రెండు బ్యాలెట్ యూనిట్ల చొప్పున ఏర్పాటు చేశామన్నారు. 25 ఏప్రిల్ 2024 తుదిఓటర్ల జాబితా ప్రకారం.. 15,32,366 మంది ఓటర్లు, 1492 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఏప్రిల్ 25 నుంచి బీఎల్‌వోలతో ఓటరు సమాచార స్లిప్‌లను పంపిణీ చేశామని, అందులో ఏ పోలింగ్‌స్టేషన్‌లో ఓటుహక్కు

మిగతా 10వ పేజీలో..

అధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- దక్షిణ భారత్‌కు ప్రధాని మోదీ అన్యాయం
- దేశ భవిష్యత్‌ను నిర్ణయించేవి పార్లమెంట్ ఎన్నికలు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్,మే 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అత్యధిక ఎంపీ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకోవడం ఖాయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి, మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ తుమ్మల నాగేశ్వర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే కొన్ని పార్లమెంటరీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయం ఖాయమైపోయిందని, మరికొన్నింటిలో మాత్రమే పోటీ ఉందని, అదికూడా బీజేపీతో నేని బీఆర్ఎస్ ఎక్కడా తమకు పోటీ కాదని స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో ప్రధాని మోదీ ఉత్తర, దక్షిణ భారతదేశానికి వ్యత్యాసం చూపుతూ దక్షిణాదికి తీరని అన్యాయం చేశారని చెప్పారు. దక్షిణ భారత్‌లో బీజేపీ పెద్దగా లేకపోవడంతో, ఉత్తర భారతంలో పార్టీ ఎంపీలుండడం చేతనో కాని దక్షిణాదికి నిధుల పంపిణీలో సమతూకం పాటించలేదని ఆరోపించారు. దేశ భవిష్యత్ నిర్ణయించేవి పార్లమెంట్ ఎన్నికలని, రాష్ట్రంలో అత్యధికంగా కాంగ్రెస్ ఎంపీలను గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసిన బీజేపీని ప్రజలు విశ్వసించరని, నిరంకుశ పాలనను ఎదిరించిన, పోరాటపటిమ కలిగిన తెలంగాణను అవహేళన చేసుకుంటూ మాట్లాడుతున్నారని మండి పడ్డారు. కాంగ్రెస్ గెలిస్తే హిందువుల పుస్తెలు ముస్లింలకు ఇస్తారని ప్రధాని మోదీ తనస్థాయిని దిగజారి మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ మూడునెలల్లో కూలిపోతుందని బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వం ఎలా కూలిపోతుందని నిలదీశారు. అనేక రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను బీజేపీ కూల్చిందని అది తెలంగాణలో సాధ్యం కాదన్నారు. సీఎం రేవంత్ ప్రభుత్వాన్ని కదిలించడం బీఆర్ఎస్, బీజేపీ తరం కాదన్నారు.

బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా కష్టమే!

పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా గెల వడం కష్టమేనని తుమ్మల నాగేశ్వర్‌రావు జోస్యం చెప్పారు. నిన్నటి వరకు ఒకటి, రెండు సీట్లలో వారికి ఆశలుండేవని ఇప్పుడు అవి కూడాపోయా యన్నారు. అసత్య ప్రచారాలతో మాజీ సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేశారని విమర్శించారు. చేపపిల్లలు, గొర్రెల పథకంలో అవినీతి జరిగిందని, వ్యవస్థలన్నిటిని బీఆర్ఎస్ విచ్ఛిన్నం చేసిందని మండిపడ్డారు. బీజేపీని గెలిపించడానికి బీఆర్ఎస్ తాపత్రయం పడుతోందని విమర్శించారు. ఉమ్మ డి మహబూబ్‌నగర్, నల్లగొండ, భువనగిరి,

మిగతా 10వ పేజీలో..

మోదీ చేసిన అభివృద్ధే బీజేపీని గెలిపిస్తాయి

- బడుగుల అభ్యున్నతి కోసం సంక్షేమ పథకాలు
- పార్టీ కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్‌విరెమణి



మానుకోటలో మాట్లాడుతున్న జగదీష్‌విరెమణి, పక్కన సీతారాంనాయక్

మహబూబాబాద్ రూరల్, మే 11 : కేంద్రంలో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధే బీజేపీని గెలిపిస్తాయని పార్టీ కర్ణాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీష్‌విరెమణి ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆ పార్టీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ గెలుపు కోరుతూ శనివారం మానుకోట పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ పదేళ్ల పాలనలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా అనేక పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. బీజేపీ పార్టీకి 400 సీట్లు వస్తాయని, అందులో మహబూబాబాద్ పార్లమెంటరీ సీటు కూడా ఉంటుందని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులు ఈ ఎన్నికల్లో గెలిస్తే మంత్రి అవుతారా! అని.. వారు ప్రతిపక్షంలోనే కూర్చుంటారని పేర్కొన్నారు. బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ గెలిస్తే కేంద్రమంత్రి అవుతారని చెప్పారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని, ప్రధాని మోదీ ప్రమాణస్వీకారం చేస్తారని ధీమా చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు మోసంగి మురళి, నాయిని ధర్మారెడ్డి, బోయినపల్లి లక్ష్మణ్‌రావు, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, శశివర్ధన్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, పల్లె సందీప్, చుక్కల నరేష్, ప్రేమ్‌రాయుడు, బాలునాయక్, వెన్నమల్ల సందీప్, ఓర్సు పద్మావతి, ఇందుభారతి, రేష్మా, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

దేశభద్రత, భవిష్యత్ కోసం గెలిపించాలి : సీతారాంనాయక్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే దేశభద్రత, భవిష్యత్ బాగుటుందని ఆ పార్టీ మహబూబాబాద్ పార్లమెంటరీ అభ్యర్థి సీతారాంనాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడారు. కేంద్రంలో మళ్లీ మోదీ ప్రధాన మంత్రి అయితేనే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు ఎత్తివేస్తారని కాంగ్రెస్‌ప్రచారం

మిగతా 10వ పేజీలో..

శనివారం ఉష్ణోగ్రత | గరిష్ఠం : 38.0°C | కనిష్ఠం : 25.0°C

కాంగ్రెస్ పాలనలోనే సామాజిక న్యాయం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

- 10వ పేజీలో..

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కాజీపేట, మే 11: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలోని యార్డులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ యార్డులో శనివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 55 - 60 యేళ్ల లోపు ఉంటుంది. ఎత్తు 5.8, గుండ్రటి ఎరుపైన ముఖం, బ్రౌన్ వైట్అండ్ బ్లాక్ ఫుల్ షర్ట్ ధరించి ఉన్నాడు. బ్లాక్ చెక్స్ లుంగీ ధరించి ఉన్నాడు. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపర్చామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

మోదీ పాలనలో దేశం సురక్షితం

వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్

మడికొండ, మే 11: నరేంద్ర మోదీ పాలనలోనే దేశం సురక్షితంగా, సుభిక్షంగా ఉందని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. మడికొండలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో రమేష్ పాల్గొన్నారు. యువతతో కలిసి బైక్ నడుపుతూ కమలం గుర్తుకు ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దేశంలో 50 ఏళ్లు పరిపాలించి దేశానికి ఉపయోగపడే ఒక్కపని చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో కబ్జాలు, స్కాంలు, మతఘర్షణలు, బార్డర్‌లో యుద్ధాలు, దేశంలో బాంబుపేలుళ్లు ఉండేవన్నారు. బీజేపీ పాలనలో సురక్షితంగా, సుభిక్షంగా ఉందన్నారు. తనను భారీ మెజారిటీతో గెలిపించి మోదీ ప్రభుత్వంలోకి పంపిస్తే సమస్యలపై నిరంతరం శ్రమిస్తానని అరూరి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో

జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, పార్టీ సీనియర్ నాయకులు తౌటిరెడ్డి రవిందర్‌రెడ్డి, నాయకులు ముత్తోజు సురేష్, దువ్వ నవీన్, కందుకూరి బాలరాజు, దార ధనుంజయ్, బొల్లికొండ వినోద్, కొలిపాక కుమార్‌బాబు పాల్గొన్నారు.



మడికొండలో బైక్ ర్యాలీలో పాల్గొన్న అరూరి రమేష్

బీజేపీలో పలువురి చేరిక

ఐనవోలు: లింగమోరిగూడెం మాజీ సర్పంచ్ మారెపెల్లి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా పార్టీల నుంచి సుమారు 50మంది బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ మజ్జిగ జయపాల్, అరూరి విశాల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు లక్షల మెజారిటీతో గెలుస్తా..

న్యూశాయంపేట, మే11: మే 13వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల్లో రెండు లక్షల మెజారిటీతో గెలుస్తానని వరంగల్ లోక్‌సభ బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరూరి రమేష్ మాట్లాడారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని అన్ని వర్గాల ప్రజల మద్దతు తనకే ఉందన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ వేల కోట్ల రూపాయల డబ్బులు ఇక్కడ పంచి గెలవాలని చూస్తోందని ఆరోపించారు. వాళ్లు ఇచ్చే డబ్బులను ప్రజలు తీసుకుని ఓట్లు బీజేపీకి వేయాలన్నారు. ప్రధాని మోదీని చూసి కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారన్నారు. ఎంపీగా గెలిచిన తర్వాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చే బాధ్యత తనదేనన్నారు. కాంగ్రెస్ 6గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చిందని, ఇందులో ఏవీ సరిగా నెరవేర్చలేదన్నారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేసే నాయకుల చరిత్ర ప్రజలకు తెలుసునన్నారు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహ ంతో పనిచేస్తున్నారన్నారు. పోలింగ్ శాతం ఎంత పెరిగితే అంత మెజారిటీ వస్తుందని చెప్పారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో వరంగ ల్ లోక్‌సభ పరిధిలోని ప్రజలందరూ ఉదయం 6గంటల నుంచే పోలింగ్ బూత్‌లకు వెళ్లి కమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలని ఈ సందర్భంగా అరూరి ప్రజలకు విన్నవించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా నాయకులు అరూరి రమేష్‌కు మద్దతు ప్రకటించారు. సమావేశంలో బీజేపీ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల బీజేపీ పార్టీ అధ్యక్షులు రావు పద్మ, గంటా రవి, వరంగల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మురళీధర్‌గౌడ్‌తోపాటు బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మకర, చంద్రప్రభ వాహనాలపై అమ్మవారు



అమ్మవారిని వాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

మూడో రోజుకు భద్రకాళి బ్రహ్మోత్సవాలు

వరంగల్ కల్చరల్, మే 11: వరంగల్ నగరంలోని భద్రకాళి దేవస్థానంలో కొనసాగుతున్న కల్యాణ బ్రహ్మోత్సవాలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం నిర్వహించి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మకర, చంద్రప్రభ వాహనాలపై ఊరేగించారు. శనివారం ఉమ్మడి జిల్లాకు చెందిన పెరిక కుల సం ఘం అమ్మవారి పూజ ఉభయ సేవా దాతలుగా వ్యవహరించారు. భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులు పోటెత్తారు. నేడు (ఆదివారం) శంకర జయంతి సందర్భంగా భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, ఈవో శేషు భారతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారిని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, గ్రేటర్ జిల్లా పెరిక సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ వడ్డే రవీందర్, గౌరవ అధ్యక్షుడు దిడ్డి నరేందర్, రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ అధ్యక్షుడు ముత్తినేని వీరయ్య, ఆధ్యాత్మిక వేత్త రామాయణ సుధానిధి ప్రవచన కర్త డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు దర్శించుకున్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ఐనవోలు, మే 11: మండలంలోని లింగమోరిగూడెం మాజీ సర్పంచ్ మారెపెల్లి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా పార్టీల నుంచి సుమారు 50మంది బీజేపీలో చేరినట్లు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెలి శ్రీరాములు పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. దేవస్థానం మాజీ చైర్మన్ మజ్జిగ జయపాల్, అరూరి విశాల్ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు

అందరూ సహకరించాలి

- ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి.. 144 సెక్షన్ అమలు
- వరంగల్ లోకసభ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావిణ్య



మాట్లాడుతున్న వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 11: లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని వరంగల్ లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య కోరారు. శనివారం వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టామన్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 98.28శాతం ఓటరు స్లిప్పులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఓటు హక్కు వినియోగంపై స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ద్వారా వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తూ, పట్టణ ప్రాంతాల్లో ఓటుశాతం పెంచడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బరిలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రచారాలు, సమావేశాలు రద్దు చేసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కల్యాణ మండపాలు, కమ్యూనిటీ హాళ్లు, హోటళ్లలో ఉన్న జిల్లాలకు చెందిన వ్యక్తులు ఉంటే స్వస్థలాలకు వెళ్లిపోవాలని సూచించారు. పేపర్లలో ప్రకటన కోసం ముందస్తుగా ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఓటరు కార్డు లేని వారు ఆధార్, పాన్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ ఏదేని ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డుతో కూడా ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులు, మహిళల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు సైతం చేశామని, ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో దివ్యాంగ, మహిళా, మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనుండగా, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. 12వ తేదీన సాయంత్రం వరకు వారికి కేటాయించిన కేంద్రాలకు చేరుకునేలా ఏర్పాటు చేశామన్నారు. 2126 మంది పీవోలు, 2126 మంది ఏపీవోలు, 4243 మంది ఓపీవోలు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకొని సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ ముగిసే వరకు కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను పోలీసు పహారా మధ్య ఏనుమాముల మార్కెట్‌లోని గోడౌన్‌లో భద్రపరుస్తామన్నారు. పోలింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘనలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు సీపీ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ శ్రీనివాస్, డీపీఆర్‌ఓ అయూబ్ అలీ, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీటీఐలకు ఎన్నికల విధులేల?

విధుల్లో లేని ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల కేటాయింపు

ఆందోళనలో రాష్ట్ర వ్యాప్తంగా 2,400 మంది పీటీఐలు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 11: విద్యా సంవత్సరం ముగింపుతో విధుల నుంచి తొలగించిన పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల(పీటీఐ)లకు ఎన్నికల విధులు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,400మంది పీటీఐలు ఉద్యోగులుకాకుండా ఏ హోదాలో విధులకు వెళ్లాలనే ఆందోళనలో పడ్డారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతున్న పీటీఐలను విద్యా సంవత్సరం ఆరంభం నుంచి చివరిరోజు వరకు మాత్రమే కొనసాగిస్తారు. తర్వాత విధుల్లోంచి తొలగిస్తారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పీటీఐల కొనసాగింపుపై తగిన నిర్ణయం తీసుకోవాల్సిందిగా రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శికి రాష్ట్ర ఎన్నికల అధికారి లేఖ రాసినట్లు తెలుస్తోంది. ఇదే కాక హైదరాబాద్‌కు చెందిన ఓ న్యాయవాది పీటీఐలను ఉద్యోగం ఉంచి తొలగించి వారిని ఎన్నికల విధులకు ఉపయోగించుకోవడంపై వచ్చే న్యాయ సంబంధమైన సమస్యలను వివరిస్తూ స్టేట్, సెంట్రల్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్లకు జీమెయిల్ ద్వారా లేఖలో వివరించినట్లు సమాచారం. అయితే రాష్ట్రంలోని పీటీఐలు వారిని ఉద్యోగంలో కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని విద్యాశాఖను కోరుతున్నారు. లేదంటే ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలని కోరుతున్నారు.

వార్డెన్ల ఖాళీల వల్లే

అదనపు బాధ్యతలు

- డీటీడీవో ప్రేమకళ

హనుమకొండ, మే 11 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో హనుమకొండ జిల్లాలో మొత్తం 12 హాస్టళ్లు ఉండగా, ఇందుకుగాను ఏడుగురు హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్లు (వార్డెన్లు) మాత్రమే ఉన్నారనీ, అందువల్ల ఉన్నవాళ్లకే అదనపు బాధ్యతలు అప్పగించామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళ ఒక ప్రకటనలో తెలిపారు. 'అధ్వాన్నంగా గిరిజన హాస్టళ్లు' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన వార్తకు ఆమె వివరణ ఇచ్చారు. ఇక హనుమకొండ జులైవాడలోని గిరిజన బాలికల వసతిగృహంలో గతంలో అదనపు బాధ్యతలు నిర్వహించిన హెచ్‌డబ్ల్యువో సస్పెండ్ అయి, తిరిగి ఇదే హాస్టల్‌లో పోసింగ్ తెచ్చుకోవడంతో విద్యార్థుల నుంచి వచ్చిన వ్యతిరేకత, పైగా ఆమె ఈ హాస్టల్‌లో పనిచేయనని లిఖిత పూర్వకంగా రాసిచ్చినందువల్ల హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో తాత్కాలికంగా పని చేసేలా తీసుకున్నామన్నారు. జనగామలోని ప్రభుత్వ బాలుర వసతి గృహ వార్డెన్ అక్కడే ఉన్న ప్రభుత్వ పోస్టుమెట్రిక్ బాలుర హాస్టల్ ఇన్‌చార్జిగా వ్యవహరించడం లేదని స్పష్టం చేశారు. హాస్టల్ పర్యవేక్షణ కొరవడలేదని, ముడుపులు చెల్లిస్తే పని అయినట్లేనన్న ఆరోపణలోనూ నిజం లేదన్నారు.

ఆడబిడ్డగా ఆశీర్వదించండి..

● వరంగల్ అభివృద్ధికి కృషి నిరంతర కృషి ●వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య



అభివాదం చేస్తున్న కడియం కావ్య, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

వడ్డెపల్లి, మే 11: ఆడబిడ్డగా తనను ఆశీర్వదించాలని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య వరంగల్ లోక్‌సభ పరిధిలోని పౌర సమాజాన్ని అభ్యర్థించారు. హనుమకొండ కేయూ 100 ఫీట్ల రోడ్డులోని ఎన్జీవోస్ కాలనీ శ్యామలగార్డెన్‌లో తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం ఆత్మీయ సమ్మేళనం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ.. మరోసారి బీజేపీ కేంద్రంలోకి అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను ఎత్తివేయడంతో పాటు అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని అన్నారు. వర్ధన్నపేటలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన అరూరి రమేష్ పేదల భూములతో పాటు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నారని కడియం కావ్య ఆరోపించారు. వర్ధన్నపేటలో చెల్లని అరూరి రమేష్ వరంగల్ లోక్‌సభలో ఎలా చెల్లుతారని ఆమె ప్రశ్నించారు. విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.కార్యక్రమంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కురిమిళ్ల రమేష్, కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలోజీ భద్రయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులు శృంగారపు భాస్కరాచారి, రుద్రోజు మణీంద్రనాథ్, కలకోటి శ్రీధర్, సలేంద్ర జక్కన్న, తాటికొండ రమాచారి, సిద్దోజు రాము, నర్సింహాచారితో పాటు మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి

కాజీపేట, మే 11: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనుంచి పోటీ చేస్తున్న కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గత పాలకుల చేతిలో కాజీపేట అన్నిరంగాల్లో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాజీపేట అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. శనివారం ఉదయం కాంగ్రెస్ పార్టీ కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి వేయిస్తంభాల గుడి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించింది. ఈ ర్యాలీని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీల మోసపూరిత వాగ్దానాలు ప్రజలు నమ్మవద్దన్నారు. ట్రైసిటీలో భాగమైన కాజీపేటలో ఇప్పటివరకు బస్టాండ్ నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ఇంటర్, డిగ్రీ కాలేజీలు, వందపడకల ఆస్పత్రి లాంటి నిర్మాణాలు బీఆర్ఎస్ పార్టీ హామీలకే పరిమితం చేసిందన్నారు. కాజీపేటను అభివృద్ధి చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. కాజీపేటలో రైల్వే డివిజన్, కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో కృషి చేసి సాధించి తీరుతామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ ప్రధాని అయితేనే ఇవి సాధ్యమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా తనకు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ర్యాలీలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, స్థానిక కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్‌తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంస్థ నాయకులు పెద్దఎత్తున హాజరై ర్యాలీలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

నా గెలుపు ఖాయం

కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

హనుమకొండ సిటీ, మే 11: వరంగల్ లోక్‌సభ ఎన్నికలో తన గెలుపు ఖాయమైందని కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య ధీమాగా చెప్పారు. ప్రజల ఆదరణ, కాంగ్రెస్ పట్ల వారిలో నెలకొన్న విశ్వాసంతో గెలుపుపై భరోసాగా ఉన్నట్లు వెల్లడించారు. శనివారం హనుమ కొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌తో కలిసి కావ్య మాట్లాడారు. ఎన్నిక ప్రచారంలో ఎక్కడికెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. పార్టీ శ్రేణులు కూడా తన గెలుపు కోసం చిత్తశుద్ధితో పని చేశారన్నారు. వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేయడం తన బాధ్యత అంటూ కావ్య వెల్లడించారు. నగరాభివృద్ధి విషయంలో ప్రత్యేక విజన్‌తో ఉన్నట్లు చెప్పారు. కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తానన్నారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు తీసుకురావడంతో పాటు ఐటీ, టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. స్మార్ట్‌సిటీతో నగర రూపురేఖలు మార్చి ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేలా పాటుపడతానని చెప్పారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిపరచడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఓటింగ్‌కు ముందే ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్‌లను తిరస్కరించినట్లు కావ్య చెప్పారు. బీజేపీ ప్రమాదకర వైఖరిని ప్రజలు పసిగట్టారని చెప్పారు. బీఆర్ఎస్ అంతర్గతంగా బీజేపీతో కుదు ర్చుకున్న ఒప్పందాన్ని ప్రజలు గుర్తించినట్లు చెప్పారు. ప్రజలు స్పష్టమైన నిర్ణయంతో ఉన్నా రని రెండు పార్టీలకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నరన్నారు. పదేళ్ల బీజేపీ, బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రానికి, వరంగల్ నగరానికి జరిగిన అభివృద్ధి శూన్యమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షు డు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. మతం, కులం పేరుతో బీజేపీ ప్రజలను రెచ్చగొట్టడం తప్ప మరేమీ తెలియదన్నారు. బీజేపీ అప్రజాస్వామిక పాలనకు బీఆర్ఎస్ వంతపాడుతూ ప్రజలను వంచించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి చర్యలను ఆచరణలో పెట్టిందన్నారు. బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకుందామని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ ప్రజలకు సూచించారు. మోదీ పాలనలో దేశంలో విధ్వంసం చెలరేగిందన్నారు. దళితులు, ముస్లింలు, క్రిస్టియన్లు ఇతర మైనారిటీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. నాడు బ్రిటీష్ పాలన నుంచి విముక్తి కోసం జరిగిన స్వాతంత్ర్య పోరాటం వలే మోదీ కబంధ హస్తాల నుంచి దేశ విముక్తి కోసం మరో పోరాటాన్ని కాంగ్రెస్ జరుపు తుంద న్నారు. ఈ పోరాటంలో ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీకి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ, మత సామరస్యం, దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ ఎం.డి. రియాజ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడు తూ.. మునుపెన్నడూ లేని రీతిలో దేశంలో దళితులు, నిరుపేదలు, క్రిస్టియన్లు, మైనారిటీలపై దాడులు జరిగాయన్నారు. సమావేశంలో బంక సరళా యాదవ్, బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, మోజెస్ ఆనంద్, అజీజ్‌ఖాన్‌తో పాటు కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.



ఉద్యమకారుడిని ఆదరించండి..

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
● పాలకుర్తిలో లోక్‌సభ ఎన్నికల ప్రచారం



పాలకుర్తిలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు

పాలకుర్తి, మే 11: పేదోడు, ఉద్యమకారుడైన బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన పాలకుర్తిలో బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ తరుపున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను ఓడగొట్టి రేవంత్‌రెడ్డిని గెలిపిస్తే రాష్ట్రాన్ని దోచుకుంటున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలతో అధికారం చేపట్టి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇప్పటివరకు చేసిందేమీ లేదన్నారు. ప్రజలు ఓటేసే ముందు ఈ విషయం ఆలోచించాలన్నారు. పార్లమెంటులో ప్రజా సమస్యలపై గళం విప్పాలన్నా.. కేంద్ర ప్రభుత్వంతో పోరాడాలన్నా.. అది ఒక్క బీఆర్ఎస్‌కు మాత్రమే సాధ్యమవుతుందని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం నెలనెలా రూ.2500 తీసుకుంటున్న మహిళలు ఆ పార్టీకే ఓటు వేయాలని, మిగతావారు బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఎర్రబెల్లి పరోక్షంగా ఎద్దేవా చేశారు. 100 రోజులు కాదు.. 200 రోజులైనా ఆ హామీలు అమలు కావని అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తే.. కాంగ్రెస్ వచ్చాక కోతలు మొదలయ్యాయని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు ఆర్థికంగా బాగుపడ్డారని అన్నారు. కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఏడ్చి ప్రజల సానుభూతితో పాలకుర్తిలో గెలిచిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన శిష్యుడే కానీ, అబద్దాల కోరు, మొనగాడని విమర్శించారు. రెండు లక్షలు రుణమాఫీ చేయకుంటే ఆరునెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని అన్నారు. అన్ని సర్వేలు బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ గెలుస్తున్నట్లు చెబుతున్నాయని అన్నారు. తనకు నామినేటెడ్ పదవి అక్కరలేదని, పాలకుర్తి నుంచే పోటీ చేస్తానని దయాకర్‌రావు స్పష్టం చేశారు.కడియం శ్రీహరికి కేసీఆర్ రాజకీయంగా ఎన్నో అవకాశాలు ఇచ్చారని, ఆయనకు ఎమ్మెల్యే టికెట్, ఆయన కుమార్తె కావ్యకు ఎంపీ టికెట్ ఇచ్చారని దయాకర్‌రావు గుర్తు చేశారు. అయినప్పటికీ అవకాశవాదంతో కాంగ్రెస్‌లో చేరిన శ్రీహరికి, ఆయన కుమార్తె కావ్యకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన తనను ప్రజలు ఎందుకు ఓడించారో ఇప్పటికీ అర్థం కావడం లేదన్నారు. తనపై ప్రజలకు కోపం లేదని, ఒక్కసారి కొత్త వ్యక్తికి అవకాశం ఇద్దామని అనుకొని ఓటేశారని అన్నారు. పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేసి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ బీఆర్ఎస్ నుచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి కోట్ల రూపాయలను దోచుకున్నాడని ఆరోపించారు. భూకబ్జాలకు కేరాఫ్ రమేషేనని ఆరోపించారు. ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశానని గుర్తుచేశారు. పార్టీలు మారే సంస్కృతి తనది కాదన్నారు. ఎంపీగా గెలిస్తే ప్రజల పక్షాన పార్లమెంటులో గళం వినిపిస్తానని తెలిపారు. రాష్ట్రం హక్కులను కాపాడేది బీఆర్ఎస్ ఒక్కటేనని స్పష్టం చేశారు. శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గం అభివృద్ధి చూస్తుంటే హైదరాబాద్ తరహాలో ఉందని, దీనికి కారణం కేసీఆర్, దయాకర్‌రావేనని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపిస్తే ఇక్కడ దయాకర్‌రావు గెలిచినట్లేనని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను ఓడించి రేవంత్‌రెడ్డికి కర్రుకాల్చి వాతపెట్టాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, నాయకులు నవీన్, ఎంపీపీ నాగిరెడ్డి, మల్లేషం, శ్రీనివాసరావు, సుందర్‌రామిరెడ్డి, రామోజీ, గాంధీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయాకర్‌రావు

మోదీకి టచ్‌లో రేవంత్

» ఏదో ఒకరోజు కాంగ్రెస్‌ను ముంచుతాడు
» మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాంనగర్, మే 11: ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీకి టచ్‌లో ఉన్నాడని, ఏదో ఒకరోజు కాంగ్రెస్‌ను ఆయన ముంచుతాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. శనివారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. ప్రజలకు మాయమాటలు చెప్పి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాడని అన్నారు. అనతికాలంలోనే కాంగ్రెస్ మోసాలను గ్రహించిన ప్రజలు.. కేసీఆర్‌ను ఓడించడంపట్ల బాధపడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. విభజన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఎయిర్‌పోర్టు ఇవ్వలేదన్నారు. రాష్ట్రానికి ఒక్క మెడికల్ కళాశాల మంజూరు చేయలేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని దయాకర్‌రావు పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కేసీఆర్‌ను కడియం శ్రీహరి మోసం చేశాడని ఆయన విమర్శించారు. తన కూతురు కోసం బీఆర్ఎస్ బీఫామ్, పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని పార్టీ మారాడని ఆయన ఆరోపించారు. కడియంకు తానే అవకాశాలు కల్పించానని ఆయన తెలిపారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కడం కడియం శ్రీహరి నైజం అన్నారు. ఆయనకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో 30వేలకు పైగా మెజారిటీతో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. వరంగల్‌లో నీతి, నిజాయితీకి మోసగాళ్లకు మధ్య పోటీ జరుగుతోందన్నారు. అవకాశాలు కల్పించిన బీఆర్ఎస్‌ను మోసం చేసిన గురుశిష్యులైన కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌లు ఒక ఒప్పందం కుదుర్చుకుని కాంగ్రెస్, బీజేపీ నుంచి పోటీచేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈ ఇద్దరినీ నామరూపాల్లేకుండా ఓడించాలనే కసితో ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. కడియం శ్రీహరి అవినీతికి, అణచివేతకు బ్రాండ్ అని, బీఆర్ఎస్ నుంచి భారీగా మూటలు తీసుకుని మోసం చేశాడని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని బడామియా మోదీ, రాష్ట్రంలోని చోటామియా రేవంత్ చేతులు కలిపారని ఆయన దుయ్యబట్టారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వరంగల్‌లో విజయం సాధించేది బీఆర్ఎస్ అని వినయభాస్కర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తన గెలుపు ఖాయమైందన్నారు.ప్రచారంలో తనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో నేతలు మర్రి యాదవరెడ్డి, వాసుదేవరెడ్డి, జనార్ధన్‌గౌడ్, జోరిక రమేశ్, నార్లగిరి రమేశ్ పాల్గొన్నారు.

పథకాలు విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

• వరంగల్ ఎంపీ స్థానం బీఆర్ఎస్‌దే • మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు


మడిపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు రూరల్, మే 11 : అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు విస్మరించిందని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం సోమారం, గుర్తూర్, కంఠాయపాలెం, మడిపల్లి గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశాల వద్దకు వెళ్లి కూలీలతో కలసి మాట్లాడుతూ తట్టాలో రేగడి మట్టి ఎత్తుకొని ట్రాక్టర్లో పోస్తూ పనులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల కాలంలో ఎక్కడ ఎలాంటి అవినీతి అక్రమాలు చేయకుండా మచ్చలేని నాయకుడిగా మీకు సేవలందించానన్నారు. ప్రభుత్వ పనితీరూ చూస్తున్న ప్రజలు మోసపోయామని గ్రహించారని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ఓట్లు వేయనున్నట్లు తెలిపారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ భారీ మెజార్టీతో గెలువబోతున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 5 స్థానాలు బీఆర్ఎస్ గెలువబోతుందని అందులో వరంగల్ ఒక్కటన్నారు. బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లలో రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. ఇంత వరకు రాష్ట్రానికి ఒక మెడికల్ కళాశాల, బయ్యారం ఫ్యాక్టరీ, కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకుండా, పేద, మధ్య తరగతి వర్గాలపై పెనుభారం మోపిందన్నారు. కాగా, ఆయా గ్రామాల్లో ప్రచారం చేయడానికి ఎర్రబెల్లి దయాకర్ రావు వెళ్లగా కూలీ పనుల వద్ద కాంగ్రెస్ జెండాలతో ఉన్న మహిళ కూలీలు దయాకర్ రావు రాకను గమనించి జెండాను పక్కన పెట్టి, జెండాలు తలపాకగా ఉండిన మాఓటు మీకే సారు అంటూ దయాకర్ రావు వద్దకు వెళ్లారు. దీంతో కొద్దిసేపు కూలీలతో మాట్లాడి గంపల్లో మట్టి ఎత్తుకొని ట్రాక్టర్‌లో పోసి సహకరించారు. మండలపార్టీ అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, ఎంపీపీ తూర్పాటి చిన్నఅంజయ్య, సోమేశ్వర్ రావు, మేరుగు రమేష్, ప్రకాశ్, సురేష్, భూపతి, నాయకులు పాల్గొన్నారు.

గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం

● తొర్రూరు : ఆరు గ్యారంటీలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను పక్కదోవ పట్టించిందని, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని మాజీ మంత్రి దయాకర్‌రావు అన్నారు. తొర్రూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుడారు. రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా మాయమాటలు చెపుతున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వరంగల్, మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థులు సుధీర్ కుమార్, కవితలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ చెప్పేది ఒకటి చేసేది ఒకటన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టీసీ అంజయ్య, జడ్పీటీసీ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీతారాములు, కౌన్సిలర్ శ్రీనివాస రావు, పొనుగోటి సోమేశ్వర్ రావు, కాలు నాయక్, కుర్ర శ్రీనివాస్, ప్రదీప్ రెడ్డ, వెంకన్న, స్వామి నాయక్, వెంకట్ రెడ్డి, భూపతి, కిరణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

• ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్ పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మే 11 : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ కోరారు. మహబూబాబాద్ టౌన్‌పోలీస్‌స్టేషన్ నుంచి పట్టణ పురవీధుల గుండా వీఎస్ఆర్ గార్డెన్ వరకు పారా మిలిటరీ బలగాలతో శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ సూచించిన నిబంధనల ప్రకారం పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రమంగా మద్యం, నగదు రవాణాకు సంబంధించిన ఎవరైనా సమాచారంతెలిస్తే వెంటనే పోలీస్‌వారికి తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య, డీఎస్పీలు తిరుపతిరావు, సురేష్, మోహన్, బాలాజీవరప్రసాద్, సీఐలు పెండ్యాల దేవేందర్, సర్వయ్య, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● మరిపెడ : సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అన్నారు. మరిపెడ పోలీస్ ఆధ్వర్యంలో లక్ష్మారెడ్డి గార్డెన్స్ నుంచి రాజీవ్‌గాంధీ సెంటర్ మీదుగా కార్గిల్ సెంటర్ వరకు ఫ్లాగ్ మార్చ్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నజర్‌పెట్టి అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ బందోబస్తు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఏఎస్పీ చెన్నయ్య, ట్రైనీ ఐపీఎస్ ఆఫీసర్ పండరీ చేతన్, తొర్రూరు డీఎస్పీ సురేశ్, మరిపెడ సీఐ హథిరామ్, మరిపెడ సీరోల్, చిన్నగూడూరు ఎస్సైలు తహెర్‌బాబా, సంతోశ్, విజయ్‌రామ్‌కుమార్, ఝాన్సీ, బీఎస్ఎఫ్, సీఆర్పీ, సివిల్ పోలీసులు ర్యాలీలో పాల్గొన్నారు.

● బయ్యారం : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బయ్యారంలో పోలీసులు కవాతు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి రామాలయం, గాంధీసెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు ఈ కవాతు నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ట్రైనీ ఐపీఎస్ కేతన్‌నితిన్, బయ్యారం సీఐ రవికుమార్, ఎస్ఐలు మౌలానా, జీనత్‌తో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

18న 'శ్రీముసలమ్మ' జాతర వేలం పాట

కొత్తగూడ, మే 11 : గుంజేడులోని శ్రీముసలమ్మ జాతరలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో భిక్షమాచారి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో కొబ్బరికాయలు, ఫొటోలు, పూజాసామగ్రి అమ్ముకునే హక్కు, తలనీలాలు, పత్తి, ధాన్యం, కొబ్బరిముక్కలు సేకరించుకునే హక్కు, శీతల పానియాలు, కిరాణం సామగ్రి విక్రయించుకునే హక్కు కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ఈనెల 16న జాతరలో టెండర్ ఫారాలు తీసుకోవాలని సూచించారు. 18న బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

'ఉక్కు పరిశ్రమ తీసుకురాకుంటే రాళ్లతో కొట్టండి'


గార్లలో రోడ్‌షోలో ప్రసంగిస్తున్న పోరిక బలరాంనాయక్

గార్ల మే 11 : కేంద్రంలో ఇండియా కూటమి ఏర్పడిన తర్వాత.. తెలంగాణ విభజన చట్టంలో పొందుపర్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమను నేలకొల్పక పోతే.. తనను రాళ్లతో కొట్టినా బాధపడనని మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంలో శనివారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనయ్యతో కలిసి మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని సత్యనారాయణపురం క్రాస్‌రోడ్ నుంచి గుంపెళ్లగూడెం, ముల్కనూరు, దుబ్బగూడెం, గార్ల పట్టణంలోని పలు విధుల్లో రోడ్ షో నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మళ్లీ గార్ల, బయ్యారం ప్రాంతంలో ఓట్లు అడగడానికిరానని స్పష్టం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత పదేళ్లుగా అభివృద్ధికి అమడ దూరంలో పెట్టిన ఘనత మోదీ సర్కారుకే దక్కిందన్నారు. దేశంలో బీజేపీ మతోన్మాద శక్తులను పెంచి పోషిస్తూ ప్రజల మధ్య విద్వేషాలను సృష్టిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బట్టు నాగరాజు, జడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, పీఏసీఎస్ ఛైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, సొసైటీ డైరెక్టర్ శెట్టి ప్రవీణ్‌కుమార్ నాయుడు, మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

(7వ పేజీ తరువాయి)

వినియోగించుకోవాలో.. మ్యాప్, లోకేషన్, సమగ్ర సమాచారం ఉందన్నారు. మే 8లోగా ఓటర్ స్లిప్‌ల పంపిణీ పూర్తయిందని పేర్కొన్నారు. ఓటరు స్లిప్‌లు అందని వారు ఎన్నికల సంఘం ధ్రువీకరించిన 14 ధ్రువపత్రాల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపించి ఓటును వినియోగించుకోవాలని చెప్పారు.

పార్లమెంట్ నియోజకవర్గంలో 1,809 పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటువేసేలా అన్ని సౌకర్యాలు కల్పించామని అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలో 317 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి 1,159 పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్‌కాస్టింగ్, ఇంటర్‌నెట్ సౌకర్యంలేని 62 పోలింగ్ కేంద్రాల్లో వీడియో చిత్రీకరణ ఏర్పాట్లు చేశామన్నారు. 650 పోలింగ్ కేంద్రాల బయట సీసీటీవీ కవరేజ్, 317 మంది మైక్రో అబ్జర్వర్లు, భద్రత సిబ్బంది ద్వారా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. మే 13న జరిగే పోలింగ్‌కు 8,683 మంది సిబ్బందిని కేటాయించడంతో పాటు అదనంగా 20 శాతం కేటాయించామన్నారు. ఎంసీసీ పకడ్బందీగా అమలు చేస్తూ నిఘా ఉంచడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ.2,09,05,160 విలువ గల నగదు, బంగారం, గంజా, లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందన్నారు.

85 ఏళ్ల పైబడిన ఓటర్లు 360, దివ్యాంగ ఓటర్లు 361 మంది ఓటర్లు హోం ఓటింగ్ ద్వారా ఓటు వేశారని అద్వైత్ కుమార్‌సింగ్ తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే 1391 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 86 మంది అత్యవసర ఓటరు జాబితాలో ఫాం-12 ద్వారా నమోదు చేసుకున్నారని, వారందరికి ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రతీ ఏఆర్‌వో పరిధిలో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయగా తద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారన్నారు. జూన్ 4న మానుకోటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ జూనియర్ బాలికల కళాశాలలో జరిగే కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు.

బలరాంనాయక్ గెలుపు కోసం తనయుడు ప్రచారం

మహబూబాబాద్ రూరల్, మే 11 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపు కోసం ఆయన తనయుడు సాయికిరణ్ శనివారం మహబూబాబాద్ మండలం అమనగల్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ... పోరిక బలరాంనాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలన్నారు. బలరాంనాయక్ ఎంపీగా గెలుపొంది కేంద్ర సహాయ మంత్రిగా పనిచేసిన కాలంలో మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి అధిక నిధులు తెప్పించి అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి., మీసాల వెంకన్న, కృష్ణమూర్తి, కేలోతు వెంకన్న, వస్త్రం, దస్రు, విజేందర్, శ్రీకాంత్, నగేష్ పాల్గొన్నారు.

'ఎన్నికల బందోబస్తుకు 3 వేల మంది పోలీసులు'

మహబూబాబాద్, మే 11 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లాలో 3 వేల మంది పైచిలుకు పోలీస్, కేంద్రబలగాలు బందోబస్తు నిర్వహించనున్నట్లు ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్‌కేకన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను తరలిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే పోలీస్ సిబ్బంది శిక్షణ పొంది ట్రైనీ సిబ్బందితో పాటు కంపెనీల కేంద్ర బలగాలు, ఇతర బలగాలు భద్రత కోసం విధుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. జిల్లా నుంచి 750 పోలీస్ సిబ్బంది ఎన్నికల బందోబస్తులో పాల్గొంటున్నారని చెప్పారు. ఎన్నికల నియమావళి, అమలును పక్కాగా పరిశీలించేందుకు 18 క్యూఆర్‌టీ, 95 మొబైల్ పార్టీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి నేటి వరకు పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో రూ.87,09,840 ఎలాంటి పత్రాలు లేని నగదును పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. రూ.91,18,107 విలువ చేసే మద్యాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. రూ.11,04,150ల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

మహబూబాబాద్ జిల్లాలో వివిధ వ్యక్తుల నుంచి 18 తుపాకులను డిపాజిట్ చేశారని సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. ప్రతీ ఒక్కరు ఎన్నికల సంఘం నిబంధనలను పాటించాలని సూచించారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి బహిరంగ ప్రచారం నిషేధమని స్పష్టం చేశారు. బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, రికార్డింగ్ వాయిస్ లాంటివి పంపడం, బాణాసంచా కాల్చడం నిషేధమన్నారు. స్థానికేతరులు తమతమ ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బంది, ఓటర్లు మినహా ఇతరులు ఎవరు లోనికి వెళ్లకూడదని, అభ్యర్థి, ఏజెంట్‌లు కూడా నిబంధనలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్‌లు లోనికి అనుమతించబడవని చెప్పారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 11న సాయంత్రం 6 గంటల నుంచి 14న సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. జిల్లాలో ఎవరు కూడా నలుగురు, అంతకంటే ఎక్కువ మంది గుంపులు.. గుంపులుగా తిరగవద్దని సూచించారు. బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధమని వెల్లడించారు.

శనివారం సాయంత్రం 4 గంటల నుంచి గార్ల, బయ్యారం, కొత్తగూడ, గంగారం ప్రాంతాల్లో మద్యం షాపులు మూసివేయడం జరిగిందన్నారు. ఇతర మండలాల్లో సాయంత్రం 6 గంటల నుంచి మూసివేయడం జరిగిందని చెప్పారు. పోలింగ్ రోజున ఎవరు కూడా పోలింగ్ కేంద్రాల చుట్టు గుమికూడవద్దని, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ఉండాలని చెప్పారు. ఎవరైనా ఎన్నికలసమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే వారి సమాచారం సి-విజిల్ యాప్‌లో, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు.

మానుకోటలో 48 గంటలు వైన్స్‌షాపుల బంద్

నెహ్రూసెంటర్, మే 11 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 48 గంటల పాటు వైన్స్‌షాపులు, బార్‌అండ్‌రెస్టారెంట్‌లు బంద్ చేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి బాదావత్ కిరణ్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం 5 గంటల నుంచి సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసే వరకు వైన్స్‌షాపులు బంద్ చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 59 వైన్స్‌లు, 9 బార్‌అండ్‌రెస్టాంరెంట్‌లు ఉన్నాయని చెప్పారు. సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి వైన్స్‌షాపులు, బార్‌అండ్‌రెస్టాంట్‌లు తెరుచుకుంటాయని పేర్కొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ

చిన్నగూడూరు, మే 11 : ఎన్నికల ప్రచారంలో భాగంగా మన్నెగూడెంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్ద ప్రచారం నిర్వహించడానికి బీఆర్ఎస్ నాయకులు వచ్చారు. అక్కడే ఉన్న ఉపాధి కూలీలు రోజుకంటే గంటముందు వెళ్తుంటే సీనియర్ మేట్ (కాంగ్రెస్ నాయకుడు)ను అడుగగా ఇరువురి మధ్య తోపులాట జరిగి ఒకరిపై ఒకరు చేయి చేసుకునే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఫిర్యాదుదారులు బీఆర్ఎస్ పార్టీ నాగమల్లేష్, కాంగ్రెస్ పార్టీ వెంకన్నతో పాటు ఆయా పార్టీల నాయకులతో కలిసి స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ఝాన్సీ వివరణ కోరగా ఫిర్యాదులు అందాయి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


జస్వంత్ (ఫైల్)

తొర్రూరు రూరల్, మే 11 : మండలంలోని నాంచారిమదూరు గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. తొర్రూరు ఎస్సై జగదీష్ కథనం ప్రకారం. పెద్దవంగర మండలం గంట్లకుంటకు చెందిన పదో తరగతి ఉత్తీర్ణుడైన చింతం జస్వంత్ (16) తొర్రూరులో బీఆర్ఎస్ కార్నర్ మీటింగ్‌కు ఆటోలో వచ్చి, తిరిగి వెళ్తుండగా పాలకుర్తి వైపు నుంచి తొర్రూరుకు వస్తున్న కారు నాంచారిమదూరు సమీపంలో ఆటోను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన జస్వంత్‌ను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి చింతం సమ్మయ్య ఫిర్యాదు మేరకు నిర్లక్ష్యంతో అతివేగంతో వచ్చిన కారుడ్రైవర్ ఠాకూర్ సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


మృతి చెందిన కాంతారావు

నెల్లికుదురు, మే 11 : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కాచికల్ శివారు ఆకేరువాగు ఒడ్డున చల్లా ముత్యాలుకు చెందిన ఇటుక బట్టీలో శనివారం జరిగింది. ఎస్సై క్రాంతి కిరణ్ కథనం ప్రకారం. భద్రాద్రికొత్తగూడెం జిల్లా, నారం వారిగూడెం మండలం, అచ్యూతాపురం గ్రామానికి చెందిన గాజింగి కాంతారావు (52) గత రెండేళ్లుగా ఇటుకబట్టీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఇటికబట్టీ పనులకు కరెంట్ అంతరాయం కలగడంతో తీగలను సరి చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గాజింగి పోలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై క్రాంతి కిరణ్ పేర్కొన్నాడు.

అధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

(7వ పేజీ తరువాయి)

ఖమ్మం, మహబూబాబాద్ లాంటిపార్లమెంటరీ నియోజకవర్గాల్లో తమకు ఏ పార్టీతో పోటీలేదన్నారు. ఇప్పటికే గెలుపు ఖాయమైందని, కొన్నింటిలో బీజేపీతో నేనని, బీఆర్ఎస్ తమకు ఎక్కడా పోటీ కాదన్నారు.

దేశంలోనే ఆదర్శవంతంగా తెలంగాణ సర్కార్..

తెలంగాణలో ఐదు గ్యారంటీలను అమలు చేసి, ప్రజలకు మేలుచేసే విధంగా పాలన సాగిస్తున్న కాంగ్రెస్ సర్కార్ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్రంలో 7వేల పైచిలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిచిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. గత బీఆర్ఎస్‌ప్రభుత్వం అప్పులు చేసిపోతే సీఎం రేవంత్‌రెడ్డి వాటికి వడ్డీలు కడుతూ నూతనంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు. 69 లక్షల మంది రైతులకు రూ.7,625 కోట్ల రైతుబంధును అన్నదాతల ఖాతాల్లో వేశామని పేర్కొన్నారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం

మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్

కాంగ్రెస్ పార్టీతోనే అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆ పార్టీ మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ అన్నారు. తన గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నేతలు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తున్నారని.. వారి మేలును ఎన్నటికి మరువని చెప్పారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. తనను మరోసారి ఆశీర్వందించి గెలిపించాలని విజ్ఞప్తి చేశా రు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్, మానుకోట, డోర్నకల్ ఎమ్మెల్యేలు భూక్య మురళీనాయక్, కోరం కనకయ్య, సాదు రమేష్‌రెడ్డి, అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అం జయ్య, గుగులోతు దస్రూనాయక్, బండారు వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంకర అయ్యప్పరెడ్డి, కోడి శ్రీను పాల్గొన్నారు.

మోదీ చేసిన అభివృద్ధే బీజేపీని గెలిపిస్తాయి

(7వ పేజీ తరువాయి)

చేయడం సరికాదన్నారు. పదేళ్ల పాలనలో ఏ ఒక్కనాడు కూడా రిజర్వేషన్ల గురించి మోదీ ఎక్కడ మాట్లాడలేదని చెప్పారు. తాను ఎంపీగా గెలిస్తే మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో ఫుడ్‌ప్రాసెస్ యూనిట్, మల్యాల కేవీకేలో అగ్రికల్చర్ వ్యవసాయ కళాశాల, జవహర్‌లాల్ నవోదయ స్కూల్, బయ్యారం పెద్ద చెరువును రిజర్వాయిర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్‌పోర్టు, మణుగూరులో కేంద్రీయ విశ్వవిద్యాలయం, దక్షిణ భారతదేశంలోనే రెండోఅయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి అధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వే మార్గం ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. తమకు టీడీపీ, జనసేన, ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయని, ప్రజలు తనను మరోమారు ఆశీర్వదించాలని కోరారు.

'సీతారాంనాయక్‌ను గెలిపించాలి'

మహబూబాబాద్ రూరల్, మే 11 : భారతీయ జనతా పార్టీ మహబూబాబాద్ పార్లమెంటరీ ఎంపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని 27వ వార్డుపరిధిలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా యాప సీతయ్య మాట్లాడారు. కార్యక్రమంలో చుక్కల నరేష్, మల్లం యశ్వంత్, కందుకూరి భరత్, చందర్, గణేష్, పవన్ పాల్గొన్నారు.

అరూరి గెలుపు కోరుతూ బీజేపీ బైక్ ర్యాలీ

తొర్రూరు : బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపు కోరుతూ శనివారం డివిజన్ కేంద్రంలో తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్ రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, కౌన్సిలర్ కొలుపుల శంకర్, కోటేశ్వర్, ఆలిసేరి రవిబాబు, కిన్నెర యాదగిరి, తూర్పాటి పాండు, యాకయ్య, పైండ్ల రాజేష్, శేఖర్, భరత్, నవీన్, రవి, వినయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే దేశం సమగ్రాభివృద్ధి

• డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డి

కేసముద్రం, మే 11 : మత విద్వేషాలతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీని ఓడించి కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పడి దేశం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డి అన్నారు. మండలంలోని అమినాపురంలో ర్యాలీ, కల్వలలో ఉపాధి కూలీల వద్ద శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఓటేసి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ అంబటి లక్ష్మి, జిల్లా నాయకులు గంట సంజీవరెడ్డి, బండారు వెంకన్న, గండి శ్రీనివాస్, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, లింగాల నేతాజి, సామ సుధాకర్‌రెడ్డి, ఉప్పుల ఏకాంతం పాల్గొన్నారు. కేసముద్రం విలేజిలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలెపల్లి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఇండియా కూటమి గెలుపే లక్ష్యంగా పని చేయాలి


ప్రచారం నిర్వహిస్తున్న టీజేఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు

మహబూబాబాద్ టౌన్, మే 11 : పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలుపే లక్ష్యంగా పని చేయాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో బలరాంనాయక్‌ను గెలిపించాలని కోరుతూ టీజేఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డోలి సత్యనారాయణ మాట్లాడుతూ...దేశంలో బీజేపీ 400 సీట్లు గెలిపించాలని కోరుతుందని అన్ని సీట్లు గెలిస్తే రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్రలకు శ్రీకారం చుడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పిల్లి సుధాకర్, శంకర్, కృష్ణ ప్రసాద్, వెంకన్న, రవి, కృష్ణ, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

సీరోలు, మే 11 : విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన సీరోలు మండలం అందనాలపాడులో శనివారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. అందనాలపాడు గ్రామానికి చెందిన ఉపేందర్ చెందిన ఆవు గ్రామ సమీపంలోని ఓ చేనులో మేత కోసం వెళ్లింది. మేత మేస్తుండగా ఒక్కసారిగా పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైరు తెగి ఆవుపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురై ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు మృతితో సుమారు రూ.50 వేలు నష్టపోయాయనని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు ఉపేందర్ విజ్ఞప్తి చేశారు.

'కాంగ్రెస్ పాలనలోనే సామాజిక న్యాయం'


పార్టీలో చేరిన వారితో మామిడాల యశస్వినిరెడ్డి

పెద్దవంగర, మే 11 : కాంగ్రెస్ పాలనలోనే సామాజిక న్యాయం సాధ్యమని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్, బీఎస్పీ నాయకులు రాంపాక అనిల్, మల్లేష్, సతీష్, యాకయ్య, భిక్షపతి, రత్నవిలాచారి, సురేష్‌బాబు, చిన్న సోమయ్య, వీరయ్య, నరేంద్ర చారి, రాజ్‌కుమార్, సాగర్‌తో పాటు పలవురు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో కొన్ని అమలు చేశామని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీలు ఢిల్లీలో దోస్తీ కట్టి, గల్లీలో కుస్తీ పడుతున్నట్లు నాటకమాడుతున్నారని విమర్శించారు. వరంగల్ ఎంపీగా కడియం కావ్యను గెలిపించి.. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలన్నారు. ఎంపీపీ కల్పనరాజుయాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు ముద్దసాని సురేష్, ఉపాధ్యక్షుడు రంగు మురళిగౌడ్, నాయకులు పన్నీరు వేణు, సతీష్, ఉపేందర్, లింగమూర్తి, సోమన్న పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందం ప్రజలు గ్రహించాలి

● తొర్రూరు రూరల్ : బీజేపీ-బీఆర్ఎస్ పార్టీలు కుదుర్చుకున్న చీకటి ఒప్పందాన్ని ప్రజలు గ్రహించి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడే కాంగ్రెస్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. నాంచారిమడూరు, వెల్లికట్టె, జీకే తండా, పెద్దమంగ్యాతండా, చింతలపల్లి, వెంకటాపురం, హరిపిరాల తదితర గ్రామాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని గ్రామాల్లో భారీ ర్యాలీ చేపట్టి, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడుతూ పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ-బీఆర్ఎస్ చీకటి ఒప్పందం కుదుర్చుకొని రాష్ట్రాన్ని, దేశాన్ని దోచుకున్నారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, మల్లారెడ్డి, ధీకొండ శ్రీనివాస్, ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మేము ఏ పార్టీలో లేం..

• మా మద్దతు బలరాంనాయక్‌కే

• జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఖాసీం

గూడూరు, మే 11 : మేము ప్రస్తుతం ఏ పార్టీలో లేము.. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం మా మద్దతు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌కే ఉంటుందని జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఖాసీం స్పష్టం చేశారు. గూడూరు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతో పాటు మా అనుచరులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సొసైటీ డైరెక్టర్ల మద్దతు బలరాంనాయక్‌కే ఉంటుందని స్పష్టం చేశారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ముక్కా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచులు ఈసం సంధ్యాసూర్యనారాయణ, జాటోతు జ్యోతిహమ్లా, పాపావత్ రవి, సారయ్య, మదియా, పూల్‌సింగ్, నవీన్, యాకూబ్‌పాషా, భరత్ పాల్గొన్నారు.

అజ్మీరా సీతారాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి : బీజేపీ

డోర్నకల్, మే 11 : మహబూబాబాద్ పార్లమెంటరీ బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ డోర్నకల్ పట్టణాధ్యక్షుడు దేవాసింగ్ అన్నారు. శనివారం డోర్నకల్ మునిసిపల్ పరిధిలోని ట్రంకుతండా, ఎర్రమట్టితండా, రాజుతండాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు. సీతారాం నాయక్ గతంలో ఎంపీగా పనిచేసిన కాలంలో డోర్నకల్ సిక్ వ్యాగన్‌షెడ్డు, గార్ల-డోర్నకల్ మధ్య రైల్వే ఓవర్‌బ్రిడ్జి, సుభాష్‌వీధి-న్యూనెహ్రూస్ట్రీట్ మధ్య అండర్ బ్రిడ్జి ఏర్పాటుచేసినట్లుపేర్కొన్నారు. డోర్నకల్‌లో పోస్టాఫీసుకు సైతం నూతన భవనాన్ని మంజూరు చేసి నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గఫూర్, జయరాజ్, రెహమాన్, పవన్, ఉపేందర్, రమేష్, కృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

బయ్యారంలో కాంగ్రెస్ బైక్ ర్యాలీ

• పాల్గొన్న ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం, మే 11 : మండలకేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. రామాలయం నుంచి గాంధీసెంటర్, ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మండల పార్టీ అధ్యక్షుడు ముసలయ్య, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ మధుకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిత్యం పేదల పక్షాన పోరాటం : సీపీఐ



సీపీఐలో చేసిన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతిస్తున్న జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

మహబూబాబాద్ టౌన్, మే 11 : నిత్యం పేదల పక్షాన నిలిచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)కి ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మహబూబాబాద్ వీరభవన్‌లో కేసముద్రం మండలం తాళ్లపూసపల్లి గ్రామానికి చెందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొల్ల కొమరయ్య శనివారం సీపీఐలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై సీపీఐ ఉద్యమిస్తున్నందున ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని చెప్పారు. మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, గ్రామశాఖ కార్యదర్శి శీలం రాములు, మండ శ్రీనివాస్, బొలగాని వేణు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెరుగు కుమార్, వరిపెల్లి వెంకన్న, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.